# గ్రామాల్లో కోతుల బెడద

- ఇళ్లలోకి దూరి దాడులు
- నెలలో పదుల సంఖ్యలో క్షతగాత్రులు
- ప్రధాన సమస్యగా మారిన వైనం



**చంద్రుగొండకు చెందిన గృహిణి ఎస్‌కె.జాన్‌బీ తన ఇంట్లో ఉండగా.. ఇటీవల కోతుల సైన్యం ఒక్కసారిగా దాడి చేసింది. భయంతో పరుగు తీసే క్రమంలో ఆమె కింద పడిపోయింది. దీంతో కోతులు మీద పడి తీవ్రంగా గాయపరిచాయి. ఆమె కాలు విరిగింది. ఇది జాన్‌బీ సమస్య మాత్రమే కాదు.. చంద్రుగొండ మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.**

**చంద్రుగొండ:** సాధారణంగా ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటారు. ఇప్పుడు ఆ సమస్యలు ఎలా ఉన్నా గ్రామాల్లో ప్రస్తుతం కోతుల బెడద ప్రధాన సమస్యగా మారింది. తలుపు తీసి ఉంటే చాలు.. ఇళ్లలోకి వానరాలు దూరిపోతున్నాయి. ఇంట్లోని ఆహారం ఎత్తుకెళ్లడంతోపాటు అడ్డుకునే వారిపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. కోతుల దాడులతో నెలలో పదులసంఖ్యలోనే క్షతగాత్రులు ఆస్పత్రుల పాలౌతున్నారు.

**పంటలు, బాటసారులపై దాడి..**

ఇళ్లలోకి దూరి బీభత్సం సృష్టించడంతోపాటు.. దారి వెంట నడిచే మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలపైనా కోతులు దాడికి దిగుతున్నాయి. మరోవైపు పంటలను నాశనం చేస్తున్నాయి. కోతుల బెడద కారణంగానే అపరాల పంటల సేద్యం వైపు రైతులు కన్నెత్తిచూడటం లేదు. పత్తి, వరి పంటలను సైతం నాశనం చేస్తున్నాయి. కోతుల సమస్యను నివారించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### కోతుల సమస్యను పరిష్కరించాలి



కోతులతో పడుతున్న ఇబ్బందులను చెప్పలేకపోతున్నాం. ప్రభుత్వం నుంచి ప్రస్తుతం మేం ఆశిస్తుంది కోతుల బెడద నుండి కాపాడటమే. ఈ పరిస్థితిని మేం ఎప్పుడు ఎదుర్కోలేదు.

– విప్పర్ల వెంకటేశ్వర్లు, హమాలీ మేస్త్రీ, అయన్నపాలెం

### భయం, భయంగా గడుపుతున్నాం..



ప్రతి రోజూ భయం.. భయంగా గడుపుతున్నాం. కోతులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. నా భార్య జాన్‌బీపై దాడి చేసి గాయపరిచాయి. ఆరోగ్యశ్రీలో వైద్యం జరుగుతుంది. రూ.30 వేల వరకు వైద్యఖర్చులకు అయ్యాయి.

– ఎస్‌కె.రహీంసాహెబ్, టైలర్, చంద్రుగొండ

### నిత్యం ఆందోళనే..



కోతుల సమస్య తీవ్రంగా ఉంది. రైతులు, వ్యాపారులు, సామాన్యులు కోతులతో ఇబ్బందులు పడుతున్నారు. కోతులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని ఆందోళనలో ప్రజలు ఉన్నారు.

–ఎస్‌కె.నాగుల్‌మీరా, పండ్ల వ్యాపారి, చంద్రుగొండ

# పంట నష్టం అంచనా

**అశ్వారావుపేటరూరల్:** అకాల గాలి దుమారం కారణంగా దెబ్బతిన్న పంటలను బుధవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండల పరిధిలోని కొత్త మామిళ్లవారిగూడెం సమీపంలో నల్లా వెంకటేశ్వరరావుకు నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్న మునగ తోట గాలి బీభత్సంతో పూర్తిగా నేలమట్టం కాగా, ఈ తోటను స్థానిక ఏఓ శివరాం ప్రసాద్ పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే మండలంలోని నల్లబాడు, వినాయకపురం, ఆసుపాక, తిరుమలకుంట, పాకలగూడెం గ్రామాల్లో పర్యటించి వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కాగా, వరి, మొక్కజొన్న పంటలకు నష్టం జరగలేదని, నేలమట్టమైన మునగ తోట వివరాలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఈ సందర్భంగా ఏఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు నార్లపాటి రవీంద్ర, సతీష్, సూరిబాబు, షాకిరా బాను, పలువురు రైతులు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: నేలమట్టమైన మునగ తోట వివరాలు తెలుసుకుంటున్న ఏఓ

**దమ్మపేట:** ఇటీవల భారీ గాలి దుమారంతో పాటుగా కురిసిన భారీ వర్షం కారణంగా మండలంలో సంభవించిన పంట నష్టంను అంచనా వేయడానికి, బాధిత రైతుల వ్యవసాయ క్షేత్రాలను వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం సందర్శించారు. మండల పరిధిలోని జగ్గారం, అంకంపాలెం, నాచారం, నాగుపల్లి తదితర గ్రామాల్లో వర్ష ప్రభావం చేత నష్టపోయిన పంటలను, మండల వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి సిబ్బందితో కలసి పరిశీలించారు. గాలి తీవ్రతకు ఒరిగిపోయిన మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించి, నష్ట తీవ్రతను తెలుసుకున్నారు. పంట నష్టంపై తగు నివేదికను రూపొందించి, ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏఓ తెలిపారు. ఏఈఓ కేశవరావు, రైతులు కారం శ్రీరాములు, సురేష్, బాలరాజు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి

**ములకలపల్లి:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని గ్రామస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త ముందుకు సాగాలని పార్టీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు పగిడిపాటి రవీందర్ పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్‌నాయక్ అధ్యక్షతన బుధవారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన క్రియాశీల సభ్యుల సమ్మేళనంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. స్టేట్‌కౌన్సిల్ సభ్యుడు అనుమల శ్రీనివాసరావు, పెండ్యాల వెంకట అప్పారావు, ఊకంటి మధుసూధన్ రావు, చీకటి ప్రకాశరావు, పూనెం నవీన్, యర్రంశెట్టి శ్రీనివాస్, అత్యం సాయి, పొన్నూరు భాను తదితరులు పాల్గొన్నారు.



ములకలపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న పగడిపాటి రవీందర్

**గ్రామగ్రామాన నిర్వహించాలి..**


**చర్ల:** ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు గ్రామగ్రామానా చలో గావ్ అభియాన్ చలో బస్తా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుమర్తి సతీష్ పిలుపునిచ్చారు. బుధవారం చర్లలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు నూపా రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఇర్పా సుబ్బారావు, సీనియర్ నాయకులు శ్రీనివాసాచారి, బందా మధు, బత్తుల వెంకటేశ్వర్లు, విశ్వనాథం, ముత్తవరపు రత్తయ్య, మల్లెల ప్రశాంత్, గోపాల సాయి, కుప్పా మాధవరావు, కూరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్ 'పోషణ పక్షం'


**దుమ్ముగూడెం:** మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని మండల అభివృద్ధి కార్యాలయం హాల్‌లో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోషణ పక్వాడా కార్యక్రమం ఏప్రిల్ 8 నుంచి ఏప్రిల్ 22 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లు గురించి ప్రత్యేకంగా వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సౌమ్య, సహన సుల్తానా, సుశీల, అనసూర్య, చంద్రకళ, రాజేశ్వరి, పోషణ అభియాన్ బీసీ మౌనిక, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

**కాలినడకన వెళ్లి..**

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని బచ్చువారిగూడెం పంచాయతీ పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న వలస గొత్తికోయల అవాసం రేగళ్లలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వలస గొత్తికోయ మహిళలు, చిన్నారులకు గుమ్మడవల్లి పీహెచ్‌సీ వైద్యురాలు మధులిక ఆధ్వర్యంలో ఆరోగ్య, రక్త పరీక్షలు చేశారు. అనంతరం వారికి పోషకాహారంపై అవగాహన కల్పించారు. కాగా, రేగళ్ల గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వారంతా కాలినడకన వెళ్లారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, ఏఎన్ఎం స్వరూప, అంగన్‌వాడీ టీచర్ విజయ కుమారి పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: వలస గొత్తికోయలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మధులిక



దుమ్ముగూడెం: గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

### ప్రభుత్వ పథకాలపై కళాజాతా

**చంద్రుగొండ:** మండలంలోని పోకలగూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బుధవారం కళాజాతా నిర్వహించారు. సంక్షేమ పథకాలతోపాటు రాజీవ్ యువవికాసం పథకంపై పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవి ఎండల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులు లీడర్ కాంపల్లి బాబు, నందు, మూస, నరేందర్, స్నేహ, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

### గడువు తేదీ పొడిగించాలి

**మణుగూరుటౌన్:** ఈపీ ఆపరేటర్ల(ట్రైనీ)లకు ప్రస్తుత జనరల్ క్వార్టర్ కౌన్సిలింగ్‌లో అవకాశం కల్పించేందుకు గడువు తేదీని పొడిగించాలని కోరుతూ.. టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి బుధవారం ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ నాయకులు మాట్లాడుతూ.. ట్రైనీ ఈపీ ఆపరేటర్ల కష్టాన్ని గుర్తించి వారికి జనరల్ క్వార్టర్ల కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, మస్తాన్, ముఖేశ్, పద్దం శ్రీనివాస్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**అశ్వాపురం:** మండల కేంద్రంలోని ఎక్సలెంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ఎండి.యూసఫ్, డైరెక్టర్ ఎండి.యాకూబ్‌షరీఫ్, ప్రిన్సిపల్ లెనిన్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సీపీఐ నాయకుడి వర్ధంతి

**అశ్వారావుపేటరూరల్:** సీపీఐ సీనియర్ నాయకుడు, స్వతంత్ర సమరయోధుడు సండ్ర రాజేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు బుధవారం నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌డీ సలీం, జోగిరాజు, జక్కం బలరాం, ఎస్‌డీ జాకీర్, పఠాన్ జలాల్ ఖాన్, దోమల అనిల్, ముత్తు, నూకవరపు విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

### నేటి నుంచి జాతర

**బూర్గంపాడు:** సారపాకలోని ముత్యాలమ్మపేటలో ముత్యాలమ్మతల్లి ఆలయంలో మూడు రోజుల పాటు జరగనున్న జాతర గురువారం ప్రారంభం కానుంది. ఈ జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఆలయకమిటీ ఏర్పాట్లు చేసింది. గురువారం మంగళ తోరణ అలంకరణ, గణపతి పూజ, పంచామృత అభిషేకాలు, అఖండ దీపస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపాలైన గరిగలను ఊరేగింపుగా గోదావరికి తీసుకెళ్లి స్నానాలు చేయించనున్నారు. శుక్రవారం 108 బిందెల గోదావరి జలాలతో అభిషేకాలు నిర్వహించనున్నారు. అమ్మవారికి సారె సమర్పణ, గరిగల కొలుపు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నసమారాధన ఉంటుంది. శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అమ్మవారి శోభాయాత్ర ఉంటుంది. భక్తులు, స్థానికులు అమ్మవారి జాతరకు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటి ప్రతినిధులు కోరారు.

## క్లుప్తంగా

### కొనుగోలు కేంద్రాల కోసం నిరీక్షణ



ధాన్యం ఆరబెడుతున్న రైతులు

**కరకగూడెం:** ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక పలు గ్రామాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పుల కారణంగా చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయి. మిగిలిన పంటనైనా కాపాడుకుందామంటే కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో వ్యవసాయ క్షేత్రాల్లోనే చేతికొచ్చిన పంట వర్షార్పణం అవుతోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం చిరుమళ్ల గ్రామంలో పలువురు రైతులు ప్యాడీ క్లీనర్ ద్వారా ధాన్యం శుభ్రపర్చుకున్నారు. కాగా, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలో మూడు చోట్ల మాత్రమే ప్రారంభించారు. మిగతా చోట్ల సైతం ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని, తమ ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని రైతులు వేడుకుంటున్నారు.

### తహసీల్‌లో సిబ్బంది కొరత

**అశ్వాపురం:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతతో సకాలంలో సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిప్యూటీ తహసీల్దార్ డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో డీటీతోపాటు ఆర్ఐ, సర్వేయర్, టైపిస్ట్, ఆపరేటర్, రెండు అటెండర్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఆర్ఐ పోస్టు ఖాళీతో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులకు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సర్వేయర్ లేక భూ సంబంధిత సమస్యలు పరిష్కారం కావడం లేదు. సిబ్బంది కొరతతో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### గాలిదుమారానికి ఇంటిపై పడిన చెట్టు



పద్మ ఇంటిపై పడిన చెట్టు..

**చంద్రుగొండ:** మండలంలోని అయన్నపాలెం గ్రామంలో బుధవారం రాత్రి గాలిదుమారంతో దెబ్బెందుల పద్మ అనే మహిళ ఇంటిపై వేప చెట్టు పడింది. దీంతో ఇంటిపై రేకులతోపాటు మరుగుదొడ్డి ధ్వంసం అయింది. కూలీనాలీ పనులతో జీవనం సాగించే పద్మ పరిస్థితి దీనంగా మారింది. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించాలని వేడుకుంటోంది.

### కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచండి



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు, పక్కన కోదండరాం

**మణుగూరుటౌన్:** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి సిఎండీ బలరాం నాయక్‌కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ విజ్ఞప్తి చేసింది. బుధవారం టీజేఎస్ నాయకులు, ఎమ్మెల్సీ కోదండరాం, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్‌ల సమక్షంలో సింగరేణి భవన్‌లో జేఏసీ నాయకులు సీఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేతనాలు పెంచేందుకు, వైద్య సదుపాయం, క్యాంటీన్ ఇతర చట్టబద్ధ సౌకర్యాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతిపై స్పందించిన సీఎండీ ఈఎస్ఐ అమలుకు డబ్బులు చెల్లించామని, త్వరలోనే ఈఎస్ఐ సౌకర్యాన్ని కాంట్రాక్ట్ కార్మికులకు ప్రారంభిస్తామని తెలిపారు. క్యాంటీన్ సౌకర్యం, పండగ సెలవులు తదితర చట్టపరమైన సౌకర్యాల అమలుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, కాంట్రాక్ట్ కార్మిక హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూరి శంకర్, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి, టీజేఎస్ నాయకులు వి.బాబు, మల్లెల రామనాథం తదితరులు ఉన్నారు.

# గోదారిలో వైభవంగా తెప్పోత్సవం

**దుమ్ముగూడెం:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం స్వామివారికి ఘనంగా పవిత్ర గోదావరి నదిలో తెప్పోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు నిత్యహోమం, నిత్య పూర్ణాహుతి, బలిహరణ కార్యక్రమాలను నిర్వహించి తిరువీధి సేవ అనంతరం చోరోత్సవం (దొంగలదోపు ఉత్సవం) వైభవంగా నిర్వహించారు. ముందుగా భక్తులకు ఈ ఉత్సవం విశిష్టతను అర్చకులు వివరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ముఖ్య అర్చకులు కారంపూడి కిరణకుమారాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజాచార్యులు, రాజగోపాలాచార్యులు, నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



గోదావరిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

# సుభిక్ష పాలనే ప్రభుత్వ లక్ష్యం

- గ్రామాల పర్యటనలో ఎమ్మెల్యే పాయం
- లబ్ధిదారుడి ఇంట సన్నబియ్యంతో భోజనం

**మణుగూరురూరల్:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సుభిక్ష పాలన అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలోని గిరిజన లబ్ధిదారుడు కుంజా ఎర్రయ్య ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సన్నం బియ్యం భోజనం ఆరగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తోందని, గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తోందని అన్నారు. అనంతరం శాంతినగర్ గ్రామంలో గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఊరచెరువు అలుగు కారణంగా గ్రామం ముంపుకు గురవుతోందని, నిర్మించిన చప్టా కూడా ప్రమాదకరంగా మారిందని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, మాజీ సర్పంచ్‌లు తాటి సావిత్రి, తాటి బిక్షం, కాంగ్రెస్ మండల నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సన్న బియ్యంతో భోజనాన్ని ఆరగిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మండలానికి 'సీతారామ' సాగునీరు**

**అశ్వాపురం:** సీతారామ ప్రాజెక్ట్ ద్వారా అశ్వాపురం మండలంలోని రైతాంగానికి సాగునీరు అందిస్తామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని ఆనందాపురం గ్రామంలోని రేషన్‌షాపులో లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే పాయం సన్నబియ్యం పంపిణీ చేశారు. 44 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అమెర్ధ గ్రామ పంచాయతీ కొర్సవారిగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ కొర్సా ముత్తయ్యను ఎమ్మెల్యే పరామర్శించారు. మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు విషయంలో ప్రతిపక్షాల అసత్య మాటలు ప్రజలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీఓ ముత్యాలరావు, ఆర్ఐ లావణ్య, పంచాయతీ కార్యదర్శి వేణుప్రియ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, మాజీ ఎంపీపీ ఊసా అనిల్‌కుమార్, ఓరుగంటి రమేష్, బూరెడ్డి వెంకటరెడ్డి, కొండలరావు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# రైతులు సద్వినియోగం చేసుకోవాలి



చర్ల: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

**చర్ల:** రైతుల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సత్యనారాయణపురం సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణ అధికారి దొడ్డి రామచంద్ర ప్రభు కోరారు. బుధవారం మండలంలోని కుదునూరులో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘ డైరెక్టర్లు, మండల వ్యవసాయశాఖాధికారితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు మద్దతు ధరను అందించేందుకు ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోందని అన్నారు. రైతులు రబీలో పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి లబ్ధిపొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి లావణ్య, సహకార సంఘ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

**కరకగూడెం:** రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కొనుగోలు కేంద్రాల్లోనే దక్కుతుందని డిస్ట్రిక్ కోఆపరేటివ్ సొసైటీ జిల్లా ఏరియా సూపర్వైజర్ రవి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పద్మాపురం, వెంకటాపురం, కలవలనగారం గ్రామాల్లో రైతులతో కలసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ (సన్నరకం) క్వింటా ధాన్యానికి రూ.2,320, కామన్ గ్రేడ్ (దొడ్డు రకం) క్వింటాకు రూ.2,300 ప్రభుత్వం ధర నిర్ణయించినట్లు తెలిపారు. వీటికి తోడు సన్నరకం క్వింటా ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జ్ రవితేజ, రైతులు చందా శ్రీను, పోలెబోయిన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన ధరల పెంపుపై నిరసన



బూర్గంపాడు: ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

**చంద్రుగొండ:** మండలంలోని కరిశెలబోడుతండాలో పెంచిన గ్యాస్, పెట్రో ధరలపై బుధవారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ సబ్‌డివిజన్ నాయకుడు బాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు భాను, చిన సేవ్యా, రాము, భద్రమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

**సీపీఎం ఆధ్వర్యంలో..**

**బూర్గంపాడు:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం బూర్గంపాడులో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ వంటగ్యాస్‌పై సిలిండర్‌కు రూ.50లు పెంచి సామాన్యుడిపై భారం మోపిందన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించేవరకు ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, అబీదా, సూర్య, సతీష్ పాల్గొన్నారు.

**సీపీఐ ఆధ్వర్యంలో..**

**మణుగూరుటౌన్:** పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం ఎదుట బుధవారం నాయకులు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమైఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి సుధాకర్‌లు మాట్లాడుతూ.. మహిళలు వినియోగించే గ్యాస్ ధరలను కావాలనే బండకు రూ.50 పెంచడం సామాన్యుడిపై భారం మోపడమేనన్నారు.

వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు సర్వర్, గడ్డం వెంకటేశ్వర్లు, బాడిశ సతీష్, మంద కోటేశ్వరరావు, బోలగాని సమ్మక్క, దుబ్బాక నిర్మల, దుబ్బాక ప్రమీల, ఆదర్ల రేణుక, వంగ సుశీల, ఆదర్ల రాములు, బోసేటి సంపత్, కన్నెబోయిన ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# రేగా జన్మదిన వేడుకలు

పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు జన్మదిన వేడుకలను బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమాలను ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. పలుచోట్ల ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కాగా, మణుగూరు పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో రేగా పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: మాజీ ఎమ్మెల్యే కాంతారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు